

అనగనగా ఓ మంచి కథ

# ఒకటే చీర

## శ్రీ వేలూరి శివరామశాస్త్రి(శతావధాని)

## (ఆంధ్ర పత్రిక 1947 సెప్టెంబర్ 17 నుంచి)

**'నీవు తిని వచ్చిన** తరువాత నే బోయితిని వత్తును గాని, ముందు నీవేగి తినిరా, చీకటిపడినను నాకు భయములేదు' అని అత్తయనెను

అచ్చరయినను పిశాచముగా జేసివైచు కోక కట్టుకుని కూర్చున్న కోడలొక్క నిమిషమాలోచించి 'కాదు కాదు, మీరే ముందు వెళ్ళవలయును, మీరు వచ్చిన తరువాతనే నేను' అని యనెను.

'మానమును మరియాదయు ఎక్కువ వారికిగాని మముబోటి తక్కువవారికి గావమ్మా! కాబట్టి ఆ సంగతి వదిలిపెట్టు. నీకు మధ్యాహ్నము కూడా కూడు లేదు. పైగా చిన్నదానవు. చీకటిలో ఆ గుంపులో త్రోసికొని వచ్చుటయు ప్రమాదము' అని అత్తయనెను.

'మానమును మరియాదయును, గాలియు, నీళ్ళయువంటి వత్తా! తండ్రియును, కొడుకును తిని పదకొండు గంటలకే నాగరాజుగారి యింటికి వెళ్ళిరిగదా! మీకు మాత్రము మధ్యాహ్నము కూడేది? కాబట్టి ముందర మీరే వెళ్ళిరండు, తరువాతనే నేను వెళ్ళుదును. చీకటి యనియు, గుంపనియు నాకొక దయ్యము చూపితిరి. దయ్యములు నన్ను జూచి పారిపోవును ' అని కోడలనెను.

'కాదమ్మా నీవు పచ్చ పసుపు పోసినట్లులు మెరుపులు ముద్ద చేసినట్లుందువు. నీకు దృష్టి తగులునమ్మా మరి చెప్పను '

'మీ మాటయే నిజమగుగాక మెరుపుల ముట్టినచో షాక్ తగులునత్తా! దానికేమిగానిముందు మీ వంతు.'

'కోడలు మిగుల వినయ విధేయతలు కలది అత్తమాట కెన్నడు నెదురాడి యెరుగదు. ఆడుచో, మరి వింధ్యపర్వతమే ఈ సంగతి ఆ యత్తకు తెలియును కాబట్టి యిక లాభము లేదనుకుని అత్త తన అతుకులబొంత విడిచి అటకమీది చీర తీసి కట్టుకుని నాగరాజుగారి సత్రమునకు వెళ్ళెను.

ఆ బస్తీలో నెటు చూచినను నాగరాజు పేరే నాగరాజు ఆసుపత్రి.నాగరాజు అనాధ శరణాలయము. నాగరాజు దేవాలయము. నాగరాజు కాలేజి, నాగరాజు సత్రము, నాగరాజు కొళాయి, నాగరాజు వీధి. వీధి యేమి కర్మము ఇంక ఆ బస్తీ బస్తీ నాగరాజపురమైపోవునని అనుకొందును.

నాగరాజిపుడు పేదవారికి జావపోయుటకొక సత్రమారంభించెను. ప్రతి దినము సాయంకాలమారుగంటలకారంభము, పది గంటలకు భరత వాక్యము కష్టపడి సంపాదించుకొనువారు గుడ నిట దినమరగి సోమరులయిపోదురను సదుద్దేశముతోడనే యిపుడతడు నూకల జావ పోయుట కేర్పాటొనరించేను. కష్టపడి సంపాదించుకొనగలవారికి ఈ నూకల జావ తినుట అవమానమును అన్నదమ్ములని యతడెరుగక పోవచ్చును.

రోడ్డు కిరుప్రక్కలనున్న మురికి కాలువల నీరు తగలకుండ జనులు కడు జాగరూకతతో గూర్చుండిరి. దుమ్ములేవకుండ రోడ్లమీద నీరు కొట్టిరి. నాగరాజు అండ్ సన్స్ వారి బియ్యపు మరయందును, పిండి మరయందును, నూనె మరయందును, పంచదార మరయందును, పనిచేయువారెందరో వచ్చి విస్తళ్ళు వేయదొడగిరి. నాగరాజును, అతని కొడుకు గంగరాజును బంతుల వెంట దిరుగుచు అజమాయిషీ చేయుచుండిరి. కొందరు పచ్చడియు, మరికొందరు కూరయి వేసికొనుచు బోవుచుండిరి. తరవాత నూకల జావ వచ్చెను. అది పేరునకే జావకాని తినుటకు ముద్దకట్టుగనే యుండెను.

దరిద్రనారాయణులందరును, దంతయంత్రములు విప్పిరి. 'ఇంక నొక యేడాదివరకును తిండిలేక చావమ'ను ధైర్యము వారి మొగములలో గనబడుచుండెను. గ్రుడ్డివారందరును నాగరాజును చూడవలెయననియు, కుంటివారంద్రందరును నాగరాజు మంగలికి పరువెత్తి జేపట్టవలయుననియు దలచుచుండిరి. అంగవైకల్యము లేనివారందరును నాగరాజును, అతని కుమారుడు తమ నడుమునుండి పోవుచుండగా తలలు వంచుకొనుచుండిరి.

తన యింటిచుట్టును నలువైపులనున్న రోడ్ల నడుమ నడుచుచు, ఈ దరిద్రనారాయణులను జూచుచున్న నాగరాజు హృదయం బరువెక్కెను. శిల్పసంపదతో, రసపురుషుని దెలుపు తన పాలరాతి మేడ చుట్టును కూర్చున్న యీ జీవచ్ఛవములను జూచుచున్న నాగార్జునకు, సృష్టిచేయు బ్రహ్మకీ విశ్వమునిండ శవములు కనిపించుచో నెటులుండునో యటులుండెను. అతడు వడివడిగా ఆ రోడ్డుదాటి యెడమవైపు రోడ్డుమీదికి దిరిగెను.

అచట బంతులన్నియు పూలమొక్కలు పాతిన చందముగా నుండెను. అతని కంటికి గొంచెము శాంతి దొరకెను. నడుచుచు నడచుచు నున్న వాడచట నాగి యచట గూర్చున్న వారినందరను పరికించెను. పలువురు తన మిల్లులలో పని బాగులవారే 'వీరుగూడ నిచటి కేల వచ్చిరి? ' అని యతడనుకొనెను. ఇక నిలిచినచో బాగుండదు. వారందరు ఆడువాంద్రు. అతడు మెలమెల్లగా పదియడుగులు నడచెను. అచట వింత తోడను, వెగటు తోడను అతడాగిపోయెను. మాతరమ్మ ప్రతిదినమును తనయింటికి పాలు తెచ్చియిచ్చును, బియ్యపు మరలో కూలిది.

మాతరమ్మ జావముద్దు తినుచున్నది. ఆతడాగి చూచెను. మాతరమ్మయు జూచెను. ఆమెలో నెక్కడేని యేమాత్రమేని సందియము లేదు. తన హక్కును తాను వృధాచేయకుండా వినియోగించుచున్న చందముగా తినుచు లోలోపల నాగరాజునకు మ్రొక్కుచున్నది. నాగరాజు కొడుకును బిలిచి సరిగా వినియోగము చేయింపుమని చెప్పి మేడలోనికి వెళ్ళిపోయెను.

'అప్పుడే వచ్చితిరేమి? దరిద్రనారాయణ సేవ సమాప్తమా?' యని యతని భార్య యోగమాయ ప్రశ్నించెను.

'ఇది సేవకాదు, పరీక్ష '

'నారాయణునికి పరిక్షయా?'

'ఆ, దరిద్రనారాయణ పరీక్ష ఈ గుంపులో మన మిల్లులో పనివాండ్లు కూడా పలువురు దూరిరి. వారికేమి రోగము? వారిలో నొకొక్క యాడుదెటువంటి యెటువంటి చీరకట్టుకుని వచ్చినదో యొకపరి చూడు. వైస్రాయివిందుకు వచ్చినట్లు మాతరమ్మయు వచ్చినది. నీవుకూడా అంత విలువగల కోక కట్టవు. నీవెపుడో అట్టి కోక కట్టినటులు గురుతు. '

యోగమాయ కొంచెము సిగ్గుపడి యిటులనెను. 'సరి సరి మాతరమ్మయు నామె కోడలు జయయు, ప్రతిదినమును మిల్లుకు వచ్చుచు పాలు పిండంచి మనకు దెత్తురు. ఒకనాడు నేనే పాలగిన్నె తీసికొనవలసి వచ్చెను. ఆమెను చూతునుగదా గుడ్డలమ్మ. బీరువా తీయగనే ఒక చీర కనబడెను అది కట్టించి ఆమెనపుడు మిల్లుకు పంపితిని వాండ్లు చాలా మంచివాండ్లు. '

'మంచివాండ్లగుచో నిక్కడి కేలవత్తురు? పేదలకు సత్రముగాని వీరికా? వీరికి మనము జీతము లిచ్చుటలేదా?'

'ఏమిచ్చుచున్నారు?'

'నాకు గురుతా? గుమాస్తాని అడుగు'

'మీరిచ్చునది తమకు జాలినచో మాతరమ్మ చచ్చినను సత్రమునకు రాదు '

'ఆడువాండ్రమీద నీ కభిమానము'

'ఒకవేళ నున్నచో అది మీరనుకునినటులు తప్పుకాదుగాని, మీరిచ్చు జీతము వారి కుటుంబమునకు జాలదు అది యటులుండుగాక నాకుకూడ మీ సత్తరువున వారితోపాటు తిని రావలయునని సంకల్పము కలుగుచున్నది '

'ఏమేమి?'

'ఇపుడొకడు ఈ దరిద్రులకు ప్రతినిధిగా మోకాలుదిగని కొల్లాయ కట్టుకొనుచుండగానే నొక యేడాదిపాటు దరిద్రుల దుఃఖమెంతయో కనుగొనుటకు నూకలకూడు తినజాలనా? అదియుగాక కాయకష్టమొనరించి మన సంపదలో గొంతుకు గానున్నను గొంతకు కారణమైన మన యీ కూలివాండ్ర తరువాతనే యీ దరిద్రులు మన యింజనీరుల తరువాతనే యీ దరిద్రులు '

హేతుపూర్ణమైన యీ వాక్ ప్రవాహపుటురవడికి నాగరాజు మనస్సు చాలాదవ్వుకొట్టుకుని పోయెను.

సరిగ్గా ఆ సమయమునకు మాతరమ్మ వారి ముందరికి వచ్చి కొంచెము వెనుకకు తగ్గి తలుపుచాటున నిలువబడెను.

నాగరాజు కొంచెము బిడియపడి మేడమీదికి పోబోయి గదిలోనికి మరలెను.

'కోడలిని దీసికొని రాకుండా నీవొక్క తెవే వచ్చితివేమి?' అని యోగమాయ అడిగెను.

'చీర్ర్' అని ఆగిపోయి కొంచెము సిగ్గుపడి వేదన ననుభవించి మాతరమ్మ వడివడిగా వెళ్ళిపోయెను.

మాతరమ్మ వెళ్ళిన గంట తరువాత కోడలు జయ ఏ రోడ్డు మూలనో కూర్చుండి ఆకలి పోగొట్టుకుని కలకలలాడుచు యోగమాయ యెదుటికి వచ్చి దండము పెట్టి నిలువబడెను.

'గదిలో మీ బాబుగారున్నారు, ముందు వారికి దణ్ణము పెట్టవలెను ' అని యోగమాయ అనెను.

జయ నోరునుండి గబగబ ఈ మాటలు దొరలెను. 'ఇట్టి చీరలు  మీ యింట నెన్ని కలవు?'

జయ భయపడెను అత్తగారు చావనయిరి చచ్చునుగాని దొంగతనము చేయదని జయకును దెలియును.అంత నామె భయము తొలగెను. పిదప ఇటులనెను. 'అమ్మగారు పదిరోజుల క్రింద మా యత్తగారికి ఈ కోక ఇచ్చిరి, అదే అక్షయముగా నున్నది"

'మీ రిరువురును గలిసిరాక నీవు  వెనుక వచ్చితివేమి?'

జయకు నవ్వును దుఃఖమును వచ్చెను. 'అయ్యా, నేనిపుడు తమ సన్నిధానములో మనవి చేసికొనినదదే అందులకనియే మేమిరువురమును మిల్లు పనిలోనికి రాజాలకున్నాము. ఆమె యొకరోజునను, నే నొకరోజు నను వచ్చుచుందుము. అందువల్ల మా కొకపూటనే తిండి. మా యిరువురుకును కలిపి ఇదొకటే చీర.

COMMENTS